# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 320 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం ● 31, మే 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## బ్రిటన్‌లో సార్వత్రిక ఎన్నికల సందడి

**పార్లమెంట్ రద్దుతో మొదలైన ప్రచారం**

# జూలై 4న ముందస్తు ఎన్నికలకు రెడీ

బ్రిటన్,మే30(నమస్తే ఉదయం): బ్రిటన్‌లో త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. జులై 4న ముందస్తు ఎన్నికలకు వెళ్లనున్నట్లు ఆ దేశ ప్రధాన మంత్రి మిగతా.. 2లో



## తెలంగాణ రాష్ట్ర గీతంగా

# జయ జయహే తెలంగాణ

- ఆమోదించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన
- తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి జూన్ 2 నాటికి పదేండ్లు పూర్తి
- దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- రెండు వర్షన్లలో రూపొందించిన కవి అందెశ్రీ
- లోగోపై అసెంబ్లీలో చర్చిస్తామని వెల్లడి
- జూన్2న ఆవిర్భావ వేడుకల్లో ఆవిష్కరణ
- అఖిలపక్షభేటీలో గేయాన్ని ఆలపించిన కీరవాణి బృందం
- గేయం బాగుందని కితాబిచ్చిన నేతలు
- జూన్ 2న గీతాన్ని జాతికి అంకితం చేస్తామని సిఎం వెల్లడి

హైదరాబాద్,మే30 (నమస్తే ఉదయం): జయ జయహే తెలంగాణ గేయాన్ని ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర గీతంగా ఆమోదించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి ఈ ఏడాది జూన్ 2వ తేదీ నాటికి పదేండ్లు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదే వేడుకల సందర్భంగా జయ జయహే తెలంగాణ గీతాన్ని జాతికి అంకితం చేస్తామని చెప్పారు. ఉద్యమ కాలంలో అందరినీ ఉర్రూతలూగించిన తెలంగాణ ఖ్యాతిని చాటిన ఈ గీతాన్ని భవిష్యత్తులో తరతరాలు పాడుకునేలా, అందరి ఆమోదంతో రాష్ట్ర గీతంగా ఆమోదించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ కవి, రచయిత అందెశ్రీ ఇరవై ఏండ్ల కిందట రాసిన ఈ గీతాన్ని యథాతథంగా అమోదించినట్లు ప్రకటించారు. ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణి సంగీతంతో పాటు స్వరాలు కూర్చారు. సచివాలయంలో గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖతో పాటు మాజీ మంత్రి జానారెడ్డి, ప్రొఫెసర్ కోదండరాంతో పాటు కవి అందెశ్రీ, సంగీత దర్శకులు కీరవాణి, సీపీఐ ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, తెలంగాణ బిల్లును ఆమోదించినప్పుడు సభలో ఉన్న మాజీ ఎంపీలు, ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.తెలంగాణ రాష్ట్ర గీతంతో పాటు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకల నిర్వహణపై చర్చించారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని రెండు వర్షన్లలో తయారు చేశారు. 2.30 నిమిషాల నిడివితో ఒక వర్షన్, 13.30 నిమిషాల నిడివితో పూర్తి వర్షన్ రూపొందించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆలపించేందుకు వీలుగా పూర్తి గేయంలో ఉన్న మూడు చరణాలతో రెండున్నర నిమిషాల నిడివితో సంక్షిప్త గేయం ఉంటుందని సీఎం ప్రకటించారు. ఈ రెండింటినీ రాష్ట్ర గీతంగానే పరిగణిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కీరవాణి సంగీత సారథ్యంలోని యువ గాయనీ గాయకుల బృందం ఆలపించిన ఈ గీతం అందరినీ అలరించింది. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా తమ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని, అందులో భాగంగానే రాష్ట్రానికి సంబంధించిన సంక్షిప్త రూపం టీఎస్ ను టీజీగా మార్చినట్లు సీఎం తెలిపారు. వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లతో పాటు అన్ని ప్రభుత్వ సంస్థలు టీజీగా మార్పు చేశామన్నారు. కేబినేట్ లో తీసుకున్న నిర్ణయం మేరకే రాష్ట్ర గీతాన్ని ఆమోదించటం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం అధికారిక చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చాలని నిర్ణయం జరిగిందని సీఎం చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కళాకారుల నుంచి దాదాపు 500 నమూనాలు తమకు అందినట్లు సీఎం చెప్పారు. ఇంకా నమూనాలన్నీ చర్చల దశలోనే ఉన్నాయని, చిహ్నానికి సంబంధించిన తుది రూపమేదీ ఇంకా ఖరారు కాలేదని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించి కూడా తుది నిర్ణయమేది జరగలేదని, కళాకారులు వివిధ నమూనాలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. కొత్త చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాలకు సంబంధించి అపోహాలు, తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరికీ ఆమోద యోగ్యంగా ఉండేలా తెలంగాణ ప్రతిష్ఠను ఇనుమడించేలా, భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా తమ కార్యాచరణ ఉంటుందని చెప్పారు. మిగతా.. 2లో

## రాజముద్రలో చార్మినార్ తొలగింపు

**చార్మినార్ వద్ద బిఆర్ఎస్ ఆందోళన**

**రేవంత్ సర్కార్ మూర్ఖ నిర్ణయాలని కెటిఆర్ విమర్శ**



హైదరాబాద్,మే30(నమస్తే ఉదయం): తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన కొత్తలోగోలో చార్మినార్ తొలగించడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటి రామారావు ఆందోళనకు దిగారు. పార్టీ శ్రేణులతో కలసి చార్మినార్ వద్దనిరసన చేపట్టారు. రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పుల నేపథ్యంలో మాజీ మంత్రులు పద్మారావు గౌడ్, రాజయ్య, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, పార్టీ నాయకులతో కలిసి చార్మినార్ వద్ద కేటీఆర్ నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నగర ప్రగతి కనిపించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర అధికారిక చిహ్నంలో మిగతా.. 2లో

# చైనాలో మరో కొత్త వైరస్..!

- సోకితే 3 రోజుల్లోనే మరణం!!
- హెబీ మెడికల్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు వెల్లడి

న్యూఢిల్లీ,మే30(నమస్తే ఉదయం): 2020లో కరోనా మహమ్మారి ప్రపంచమంతా వణికించింది. ఈ వైరస్‌తో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. కొంతమంది శాస్త్రవేత్తలు ముందుకు వచ్చి చైనాలోని వుహాన్ ల్యాబ్ నుండి కరోనా వైరస్ ఉద్భవించిందని చెప్పారు.. కాని చైనా మాత్రం ఎలాంటి స్పందన ఇవ్వలేదు. పైగా ఈ విషయం పై ఖండించింది కూడా.. ఇప్పుడిప్పుడే ఈ మహమ్మారి నుంచి బయటపడుతుండగా తాజాగా మరో భయంకరమైన విషయం ప్రజల్లో ఒణుకు పుట్టిస్తోంది. ఇప్పుడు మరోసారి చైనా కొత్త వైరస్‌ను సృష్టించినట్లు తెలుస్తోంది. అవును.. ప్రపంచాన్ని నాశనం చేసిన కరోనా వైరస్‌కు పుట్టినిల్లు అని చెప్పుకునే చైనాలో మరో వైరస్ గురించి చర్చ మొదలైంది. తాజాగా చైనాలోని హెబీ మెడికల్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు కేవలం మూడు రోజుల్లోనే ఒక వ్యక్తిని చంపగల కొత్త వైరస్‌ను సిద్ధం చేశారు. 'సైన్స్ డైరెక్ట్' మ్యాగజైన్‌లో ప్రచురించిన ఈ పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ఎబోలా వైరస్‌ను అనుకరించేందుకు శాస్త్రవేత్తలు సింథటిక్ వైరస్‌ను ఉపయోగించి



నట్లు సమాచారం. వ్యాధికారక ప్రభావాలను అధ్యయనం చేసేం దుకు హెల్త్‌చైనీస్ శాస్త్రవేత్తలు కొత్త వైరస్ ఎబోలాను సృష్టించినట్లు తెలుస్తోంది. ఎబోలా వైరస్‌ను పోలిన మిగతా.. 2లో



# ప్రచారం ముగిసింది..

**దేశవ్యాప్తంగా ముగిసిన పార్లమెంటు ఎన్నికల ప్రచారం**

**జూన్ 1న జరగనున్న చివరి దశ పోలింగ్**

**57 లోక్ సభ నియోజకవర్గాలకు పోలింగ్**

న్యూఢిల్లీ,మే30(నమస్తే ఉదయం): లోక్ సభ ఎన్నికల ప్రచారం ముగిసింది. లోక్ సభ ఎన్నికల 7వ దశ పోలింగ్ జూన్ 1న జరగనున్నది. ఇదే చివరి దశ పోలింగ్. ఎనిమిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 57 లోక్ సభ నియోజకవర్గాలకు పోలింగ్ జరగనున్నది. ఈ ఎన్నికల్లో ప్రధాని మిగతా.. 2లో

## టోల్ ఛార్జీల

# బాదుడు తప్పదు..!

**ఐదు నుండి ఏడు శాతం పెంచడానికి కసరత్తు**

**జూన్ నెలలోనే సిద్ధంగా ఉన్న మోడీ సర్కార్**

న్యూఢిల్లీ,మే30(నమస్తే ఉదయం): దేశంలో రోడ్ల కనెక్టివిటీని బాగా పెంచామని, జాతీయరహదారులను విస్తరించామని బిజెపి పదేపదే గొప్పలు చెప్పుకుంటోంది. ఈ క్రమంలో




అందుకు తగ్గట్లుగానే పెట్రో ధరలను బాగానే పెంచింది. వాహన ఛార్జీలను పెంచారు. తాజాగా మరోమారు టోల్ వలిచేందుకు కేంద్రం సిద్దంగా ఉంది. వాహనదారులు కూడా అందుకు సిద్దపడాల్సిందే. దేశ ప్రజానీకంపై మరోమారు టోల్‌ఛార్జీ మిగతా.. 2లో

# జూన్ 1న కాశీ ప్రజలు కొత్త రికార్డును సృష్టించాలి

- మీరు వేసే ఒక్కో ఓటు నన్ను మరింత బలపరుస్తుంది
- ఓటర్లందరూ పోలింగ్‌లో పెద్ద ఎత్తున పాల్గొనాలి
- విశ్వనాథుని కృప వల్లే కాశీకి ప్రాతినిధ్యం వహిస్తున్నా
- గంగా నది నన్ను అక్కున చేర్చుకున్నది
- ప్రధాని మోదీ వీడియో సందేశం
- వారణాసి లోక్‌సభ నుంచి ప్రధాని మోదీ పోటీ



న్యూఢిల్లీ,మే30(నమస్తే ఉదయం): దేశంలో లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. లోక్ సభ ఎన్నికల 7వ దశ పోలింగ్ జూన్ 1న జరగనున్నది. ఈ నేపథ్యంలో వారణాసి ఓటర్లకు ప్రధాని మోదీ వీడియో సందేశం పంపారు. 'మీరు వేసే ఒక్కో ఓటు నన్ను మరింత బలపరుస్తుంది. జూన్ 1న కాశీ ప్రజలు కొత్త రికార్డును సృష్టించాలి. ఓటర్లందరూ ఇళ్ల నుంచి బయటకు వచ్చి పోలింగ్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలి. భక్తి, శక్తి, విరక్తికి ప్రతీక కాశీ. వారణాసి ప్రపంచానికి సాంస్కృతిక రాజధాని. సంగీతం, శాస్త్రాలకు కాశీ నిలయం. విశ్వనాథుని కృప వల్లే కాశీకి ప్రాతినిథ్యం వహిస్తున్నాను. గంగా నది నన్ను అక్కున చేర్చుకున్నది' అంటూ ఆ వీడియో సందేశంలో ప్రధాని మోదీ పేర్కొన్నారు. వారణాసి లోక్ సభ స్థానం నుంచి ప్రధాని మోదీ పోటీ చేస్తున్నారు. మిగతా.. 2లో

## జూన్ 3 నుంచి 19 వరకు

# బడిబాట

**తేదీలను రీ షెడ్యూల్ చేసిన విద్యాశాఖ**

**ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా చర్యలు**




హైదరాబాద్,మే30(నమస్తే ఉదయం): తెలంగాణ రాష్ట్రములో బడిబాట కార్యక్రమాన్ని తొలుత జూన్ 1 నుంచి 11వ తేదీ వరకు నిర్వహిం చాలని భావించింది. కానీ ఈ తేదీలను విద్యాశాఖ రీ షెడ్యూల్ చేసింది. బడి బాటలో భాగంగా స్కూల్ ఏజ్ పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్చేలా చూడాల్సి ఉంటుం ది. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా చూడా ల్సి ఉంటుంది. చిన్నారుల ను అంగన్ వాడీ కేంద్రాల్లో కూడా చేర్పించాలని పేర్కొంది. కాగా బడిబాటలో భాగంగా కలెక్టర్ల నుంచి మొదలు డీఈవో, ఎంఈఓ, హెడ్ మాస్టర్, టీచర్ వరకు ప్రతి ఒక్కరికి ఒక్కో బాధ్యత అప్పగించారు. ఇదిలా ఉండగా జూన్ 3 నుంచి జూన్ 11 వరకు మిగతా.. 2లో

## ఎన్నికల ప్రచారంలో

# మోడీ ఉల్లంఘనలు

- 421సార్లు మతపరమైన, విభజనవాద వ్యాఖ్యలు
- ధ్యానం చేస్తే జ్ఞానం రాదంటూ ఎద్దేవా
- జూన్ 4న ప్రత్యామ్నాయ ప్రభుత్వానికి తీర్పు
- మీడియా సమావేశంలో మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ (నమస్తే ఉదయం): ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగాల్లో 421 సార్లు మతపర, విభజనవాద వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. కులమతాల ఆధారంగా ఓట్లు అభ్యర్థించ కూడదని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు ఉన్న ప్పటికీ.. వాటిని ఉల్లంఘించారన్నారు. అయినా ఇసి ఎలాంటి చర్యలు తీసుకోలదేన్నారు. తాము కొన్ని సందర్భాల్లో ఫిర్యాదు చేశామని అన్నారు. లోక్‌సభ ఎన్నికల తుదిదశ ప్రచారానికి చివరిరోజైన గురువారం ఆయన దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జూన్ 4న ప్రత్యామ్నాయ సర్కారు ఏర్పడేలా ప్రజలు తీర్పు ఇస్తారన్న నమ్మకం ఉందని చెప్పారు. గత 15 రోజుల్లో మోదీ తన ప్రసంగాల్లో మిగతా.. 2లో

# ఈశాన్యంలో నైరుతి ప్రవేశం

**కేరళలో మొదలైన భారీ వర్షాలు...**

**14 జిల్లాల్లో ఎల్లో అలర్ట్**

**వారంలోగా తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశించే ఛాన్స్**

**చల్లటి కబురు అందించిన వాతావరణ శాఖ**

తిరువనంతపురం,మే30 (నమస్తే ఉదయం): నైరుతి వచ్చేసింది. కేరళ తీరాన్ని గురువారం తాకింది. ఎండలతో అల్లాడుతున్న వేళ దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లటి వార్త అందించింది. నైరుతి రుతుపవనాలు గురువారం ఉదయం కేరళను తాకినట్లు ఐఎండీ అధికారికంగా ప్రకటించింది. కేర సహా ఈశాన్య రాష్ట్రాలను నైరుతి పవనాలు తాకినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో కేరళవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. 14 జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వారంలో తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశించ నున్నట్లు చెప్పారు. లక్షద్వీప్, కేరళలోని కొన్ని ప్రాంతాలకు రుతు పవనాలు విస్తరించేందుకు పరిస్థితులు మిగతా.. 2లో

# ఘనంగా అక్కినపల్లి సాయికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వడ్డేపల్లి రాజేశ్వర్ రావు...

**కూకట్‌పల్లి, మే 30 (నమస్తే ఉదయం):**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ అక్కినపల్లి సాయి పుట్టినరోజు సందర్భంగా గురువారం వివేకానందనగర్ కాలనీలోని వడ్డేపల్లి రాజేశ్వర్ రావు నివాసంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా



శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, గోపాల్ రావు, శంకర్ రెడ్డి, పి. దుర్గాప్రసాద్ రావు, బుల్లెట్ శీను, సాయి, ఫణీంద్ర, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

## జూలై 4న ముందస్తు
# ఎన్నికలకు రెడీ

(మొదటి పేజీ తరువాయి)

రిషి సునాక్ ఇటీవలే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు బ్రిటన్ పార్లమెంట్ రద్దయ్యింది. ఎన్నికల షెడ్యూల్‌కు అనుగుణంగా పార్లమెంట్‌ను గురువారం రద్దు చేశారు. ఇక బ్రిటన్ పార్లమెంట్‌లో మొత్తం 650 మంది సభ్యులు ఉంటారు. పార్లమెంట్ రద్దుతో ఐదు వారాల ఎన్నికల ప్రచారం అధికారికంగా ప్రారంభమైంది. జులై 4న బ్రిటన్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నందున అందుకు తగ్గట్లుగా ఏర్పాటు చేస్తున్నారు. గత 14 ఏళ్లుగా బ్రిటన్‌లో కన్జర్వేటివ్ పార్టీ అధికారంలో ఉంది. రెండేళ్ల క్రితం ఆ దేశ ప్రధానిగా భారత సంతతికి చెందిన రిషి సునాక్ బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారు. అయితే, ప్రధానిగా సునాక్ తీసుకున్న నిర్ణయాలపై సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు జరగబోయే ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఎన్నికల్లో అధికార కన్జర్వేటివ్ పార్టీకి ఓటమి ఖాయమంటూ అత్యధిక ఒపీనియన్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో విపక్ష లేబర్ పార్టీ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని అంచనాలు వెలువడు తున్నాయి. నెల 23న ప్రధాని అధికారిక నివాసం '10 డౌనింగ్ స్ట్రీట్' వద్ద వర్షంలో తడుస్తూనే సునాక్ ఎన్నికల తేదీలపై ప్రకటన చేశారు. 'బ్రిటన్ ప్రజలు తమ భవిష్యత్తు ఎలా ఉండాలో ఎంచుకునే సమయం వచ్చింది. ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా ఎన్నో విజయాలను సాధించాం. దేశ ప్రజల రక్షణ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మీకు హామీ ఇస్తున్నా. దేశాధినేత కింగ్ చాలంస్‌తో మాట్లాడాను. పార్లమెంట్‌ను రద్దు చేయమని అభ్యర్థించాను. ఇందుకు రాజు కూడా అనుమతించారు. జూలై 4న దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి' అని రిషి సునాక్ వెల్లడించారు.

## తెలంగాణ రాష్ట్ర గీతంగా
# జయ జయహే తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసిన రాష్ట్ర అధికార గీతంపై కాంగ్రెస్, మిత్రపక్ష నేతలు హర్షం వ్యక్తం చేశారు. సచివాలయంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, తెజస నేతలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశయ్యారు. ఈ సందర్భంగా.. సంగీత దర్శకుడు కీరవాణి, ఆయన బృందం 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని ఆలపించారు. గీతంలో చేసిన మార్పులను కవి అందెశ్రీ వివరించారు. 13 చరణాలతో ఉన్న పూర్తి గీతం నిడివి 13.30 నిమిషాలు ఉంటుందని తెలిపారు. చరణాలు తగ్గించి రెండున్నర నిమిషాలతో రూపొందించిన గీతాన్ని కూడా వినిపించారు. రెండూ బాగున్నాయని నేతలు అన్నారు. మఖ్దూం మొహినుద్దీన్, కొమురం భీం, షేక్ బందగీ వంటి తెలంగాణ యోధుల పేర్లు కూడా ఆ గీతంలో చేర్చాలని నాయకులు సూచించగా.. పరిశీలించాలని కవి అందెశ్రీకి సీఎం సూచించారు. రాష్ట్ర అధికార చిహ్నాన్ని ఇంకా ఖరారు చేయలేదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. చిహ్నంపై ఎలాంటి భేషజాలు, పంతాలు లేవని చెప్పారు. అందరి సూచనలు తీసుకుంటామని.. అవసరమైతే కేబినెట్, అసెంబ్లీలో చర్చించాకే తుది నిర్ణయం ఉంటుందని తెలిపారు.

## టోల్ ఛార్జీల
# బాదుడు తప్పదు..!

(మొదటి పేజీ తరువాయి)

భారం పడనుంది. ప్రస్తుత ధరలపై ఐదు నుండి ఏడు శాతం పెంచడానికి కసరత్తు జరుగుతోందని సమాచారం. లారీ యజమానుల లెక్కల ప్రకారం అన్ని రోడ్లపై కలిపి ప్రతి ఏడాది టోల్‌గేట్ల రూపంలో రూ.17 వేల కోట్లు వసూలు అవుతోంది. దీని ప్రకారం ఐదుశాతం పెంచితే రూ.850 కోట్లు, ఏడుశాతం పెంచితే రూ.1190 కోట్లు భారం పడుతుందని లారీ యజమానుల సంఘం నాయకులు తెలిపారు. ఇది లెక్కల్లో కనిపించేదేనని, కనిపించని భారాలు ఇంకా ఉంటాయని వారు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే టోల్ ఛార్జీలను బాదేయాలని చూసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల దరిమిలా ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకుంది. ఈ నేపథ్యంలో జూన్ మొదటి వారంలోనే టోల్ పెంపు నిర్ణయాన్ని అమలులోకి తీసుకువచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో 55 జాతీయ రహదారుల్లో 8683.15 కిలోమీటర్ల రోడ్లు ఉన్నాయి. వీటిపై సుమారు 72 వరకూ టోల్‌గేట్లు ఉన్నాయి. ఇచ్ఛాపురం నుండి తడ వరకూ ఉన్న 16వ నెంబరు జాతీయ రహదారిపై 16 టోల్‌ప్లాజాలు ఏర్పాటు చేశారు. 1997లో కిలోమీటర్లుకు రూ.1.50 పైసలు మాత్రమే వసూలు చేస్తామని కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకున్న కేంద్రం లోని జాతీయ రహదారుల విభాగం ఇప్పుడు కిలోమీటరుకు లారీకి అయితే ఆరు నుండి ఎనిమిది రూపాయలు వరకూ వసూలు చేస్తోంది. కార్లు, బస్సులు, ఇతర వాహనాలకు వాటి స్థాయినిబట్టి కిలోమీటరుకు నాలుగు రూపాయల వరకూ వసూలు చేస్తున్నారు. టోల్‌గేటుకు టోల్‌గేటుకు మధ్య నియమిత దూరం ఉండాలనే నిబంధనను అధికారులు పాటించడం లేదు. కొన్నిచోట్ల టోల్‌గేట్లు 40 కిలోమీటర్ల లోపు ఉంటే కొన్ని చోట్ల 60 కిలోమీటర్ల లోపు ఉన్నాయి. కృష్ణాజిల్లాలో పొట్టిపాడు, కలపర్రు మధ్య 21 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. రోడ్డు నిర్మాణ సమయంలో కాంట్రాక్టులకు తీసుకున్న వారికి ఏదోఒక స్థానంలో టోల్‌గేట్ కట్టబెట్టే పేరుతో ఇష్టారాజ్యంగా అప్పగించేశారు. దీనివల్ల లారీ యజమానులపై ఎక్కువభారం పడుతోంది. టోల్ గేట్లు కూడా ఒక్క పద్ధతి ప్రకారం వసూలు ఉండటం లేదు. టోల్‌ట్యాక్స్‌కు సంబంధించి గతంలో కారు, లైట్, హెవీ వెహికల్ అని మూడు కేటగిరీలు మాత్రమే ఉండేవి. ఇలా అయితే ఎన్ని యాక్సిల్స్ ఉన్నా ఒకే ఫీజు ఉండేది. అయితే రోడ్డు అరుగుదల పేరుతో హెవీ వెహికల్స్‌ను నాలుగు రకాలుగా విభజించారు. త్రీయాక్సిల్, ఫోర్త్, సిక్స్ యాక్సిల్, ఎర్త్‌మూవింగ్ ఎక్విప్‌మెంట్స్ అంటూ పెంచుకుంటూ పోయారు. దీంతో టోల్‌భారం పెరిగిపోయింది.టోల్‌ట్యాక్స్ ఎంత పెంచినా అ భారం చివరకు వస్తువులను రవాణా చేసుకునే సంస్థలు, వ్యక్తుల మీదే పడుతుంది.

# విత్తనాల కోసం మూడోరోజూ రోడ్డెక్కిన రైతులు

### ఆదిలాబాద్‌లో పత్తి రైతుల ఆందోళన
### పంజాబ్ చౌక్‌లో ఆందోళనతో ట్రాఫిక్ జామ్
### రైతులకు న్యాయచేస్తామని అధికారుల హామీతో విరమణ

**ఆదిలాబాద్,మే30(నమస్తే ఉదయం):**
పత్తివిత్తనాల కోసం రైతుల ఆందోళన కొనసాగుతోంది. ఆదిలాబాద్‌లో వరుసగా మూడోరోజూ రైతులు విత్తనాల కోసం రోడ్డెక్కారు. అయితే పలు జిల్లాల్లో విత్తన సంక్షోభం నెలకొన్నది. విత్తనాల కోసం రైతుల వెతలు అన్నీ ఇన్నీ కావు. పచ్చిరొట్ట విత్తనాలనే పంపిణీ చేయలేక రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. జనుము, జీలుగ, పచ్చి రొట్ట విత్తనాలు ఇవ్వలేని ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు సరిపడా ఇస్తుందా..అని రైతులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా పత్తి విత్తనాలకొరతపై రైతుల ఆగ్రహం వ్యక్తంగా చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో వరుసగా మూడో రోజు విత్తనాల కొరతతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు ఒక్కో రైతుకు రెండు ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. విత్తనాల పంపిణీ, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆదిలాబాద్ పట్టణంలోని పంజాబ్ చౌక్‌లో రైతులు ధర్నా చేపట్టారు. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. సమస్యను పరిష్కరించే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని రైతులు తేల్చి చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విత్తనాల కొరత తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్ ఉన్న ప్రముఖ కంపెనీ పత్తి విత్తనాలను హోల్‌సేల్ వ్యాపారి మరో దుకాణానికి తరలించడం ఆదిలాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. మూడు రోజులుగా రైతులు బారులు తీరి ఆ కంపెనీ విత్తనాల కోసం ఇబ్బందులు పడుతుండగా గురువారం ఆదిలాబాద్ పట్టణం కిసాన్ చౌక్‌లోని నిఖిల్ ట్రేడర్స్ విత్తనాల దుకాణం నుంచి వాహనంలో 160 బ్యాగులను ఇచ్చోడ కేంద్రానికి తరలిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. రోజంతా లైన్లో నిల్చుంటే రెండు పత్తి విత్తన బ్యాగులు కూడా దొరకడం లేదని, ప్రైవేట్ డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు డీలర్‌ను ఇచ్చోడ రిటైల్ డీలర్‌కు వే బిల్లుతో సహా పత్తి విత్తనాల ప్యాకెట్లు పంపుతున్నట్టు డీలర్ తెలిపాడు. దీంతో ఆగ్రహించిన రైతులు దొంగచాటుగా విత్తనాల అక్రమ వ్యాపారం సాగిస్తున్నారని నిలదీశారు. నిఖిల్ ట్రేడర్స్ నుంచి పత్తి విత్తనాల తరలింపు వ్యవహారంపై లోతుగా విచారణ జరుపుతున్నామని, కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు.




నిలదీసిన రైతులంతా పంజాబ్ చౌరస్తా రహదారిపై బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అక్కడికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. హోల్ సేల్ దుకాణం నుంచి నిజంగానే బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. విత్తనాల కొరత, డీలర్ల ఆగడాలపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని వ్యవసాయ అధికారి పుల్లయ్య భరోసా ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

# రాజముద్రలో చార్మినార్ తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

మార్పుల ప్రతిపాదన దృష్ట్యా భారాస నేతలు చార్మినార్ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. కేసీఆర్ పేరు కనిపించకుండా ప్రభుత్వం మూర్ఖపు నిర్ణయాలు తీసుకుంటోంది. రాజకీయ కక్షతోనే మార్పు చేస్తోంది. రాష్ట్ర చిహ్నంలో చార్మినార్‌ను తొలగించడం హైదరాబాదీలను విస్మరించడమే. అమరవీరుల స్థూపం, తెలంగాణ సాంస్కృతిక చిహ్నాలను చేర్చితే అభ్యంతరం లేదు. చిహ్నంలో కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలగించడం మూర్ఖపు నిర్ణయమే కాగలదని విమర్శించారు. హైదరాబాద్ ఐకాన్‌గా చార్మినార్ ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది. తెలంగాణ ఉద్యమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనలేదు. అందుకే కేసీఆర్ పెట్టిన గుర్తులు మార్చాలని ఆయన చూస్తున్నారు. లోగో మార్పుపై భారాస తరఫున నిరసన కార్యక్రమాలు చేపడతాం అని కేటీఆర్ తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మూర్ఖపు నిర్ణయాలు తీసుకుంటున్నదని, వాటిని అంగీకరించేది లేదని కేటీఆర్ అన్నారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలతో తెలంగాణ సాధించుకున్నామని చెప్పారు. పదేండ్లలో సాధించిన ప్రగతిని కాదని కాంగ్రెస్ సర్కార్ మొండి వైఖరి అవలంబిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..లోగో నుంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశపూర్వకంగా రాజముద్రను మారుస్తున్నదని చెప్పారు. హైదరాబాద్ అంటే అందరికీ గుర్తొచ్చేది చార్మినారని తెలిపారు. ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించొద్దని సూచించారు. కాగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే మార్పు చేస్తున్నదని తెలిపారు. రాజముద్రను ఇంత అత్యవసరంగా మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. లోగోలో చార్మినార్‌ను తొలగించడం అంటే హైదరాబాదీలను అవమానించడమేనన్నారు. అధికారిక చిహ్నంలో మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడతామని హెచ్చరించారు. అమర వీరుల స్థూపాన్ని రాజముద్రలో పెట్టినంత మాత్రాన.. కాంగ్రెస్ పార్టీ వల్ల అమరులైన వారి తల్లిదండ్రులు సంతోష పడరని చెప్పారు. సోనియా గాంధీ బలి దేవత అని చెప్పిన రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ రేపటి రోజున ఎన్ని కార్యక్రమాలు పెట్టినా మర్చిపోలేని విషయం ఏంటంటే వేలాది మంది మృతులకి కారణమైన ఆ పార్టీని ప్రజలు క్షమించరని స్పష్టంచేశారు. ఇకపోతే తెలంగాణ అధికారిక చిహ్నంలో మార్పులు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది.. చిహ్నంలో మార్పులు చేర్పులపై కసరత్తులు జరుగుతున్నాయి.. ప్రజలు, ప్రజాజీవితం, ప్రజాస్వామ్యం, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, అమరుల త్యాగం తదితర అంశాలు ప్రతిబింబించేలా దీనిని రూపొందించేందుకు రేవంత్ సర్కార్ నిర్ణయించింది.. అయితే, అంతకుముందున్న చిహ్నంలోని చార్మినార్, కాకతీయ కళాతోరణాన్ని తొలగిస్తారనే ప్రచారం జరుగుతుండటంతో బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చింది. తెలంగాణ చిహ్నం మార్పుపై గురువారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలు తెలుపుతోంది. హైదరాబాద్ చార్మినార్ దగ్గర జరిగిన నిరసనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. అంతకుముందు రాష్ట్ర చిహ్నం నుంచి చార్మినార్ ను తొలగించడంపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. చార్మినార్ దశాబ్దాల తరబడి హైదరాబాద్‌కు ఐకాన్‌గా ప్రపంచంలోనే గుర్తింపు పొందిందని.. నగరం గురించి ఎవరైనా ఆలోచిస్తే వారు ప్రపంచ వారసత్వ హోదా పొందేందుకు అన్ని అర్హత లున్న చార్మినార్ గురించి ఆలోచించకుండా ఉండలేరని చెప్పారు. కానీ ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పనికిరాని కారణాలను సాకుగా చూపుతూ చార్మినార్‌ను రాష్ట్ర అధికారిక ముద్ర నుంచి తొలగించాలని భావిస్తోందంటూ ఎక్స్ లో రాశారు.

# చైనాలో మరో కొత్త వైరస్..!

(మొదటి పేజీ తరువాయి)

ఈ కొత్త సింథటిక్ వైరస్‌ను ఇటీవల దాదాపు 10 చిట్టెలుకలపై పరీక్షిం చారు. టీకా వేసిన 3 రోజుల తర్వాత చిట్టెలుకలలో తీవ్రమైన లక్షణాలు కనిపించడం ప్రారంభించాయని నివేదికలు చెబుతు న్నాయి. మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా మూడు రోజుల్లోనే మృతి చెందినట్లు సమాచారం. ఈ చిట్టెలుకలు చనిపోయిన తర్వాత, పరిశోధకులు వాటి అవయవాలను పరిశీలించగా.. వైరస్ ను వాటి శరీరంలోకి పంపించినప్పుడు చిట్టెలుక కళ్లకు ఇన్ఫెక్షన్ సోకిందని, దాని కారణంగా వాటి దృష్టి బలహీనంగా మారిందని గమనించారు. గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, ప్రేగులు, మెదడు వంటి కణజాలాలలో వైరస్ పేరుకుపోతుందని.. ఎబోలా వైరస్ లాగా ఇది శరీరంలోని కణాలకు సోకుతుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ప్రస్తుతం ఈ వైరస్ వల్ల ప్రయోజనాలు, ఇంకా ఎలాంటి ప్రాణహాని కలుగుతుందోనని సర్వత్రా తీవ్ర చర్చ మొదలైంది. ఈ భయంకరమైన వైరస్ బారి నుండి విరుగుడు కనిపెట్టేందుకు అగ్రరాజ్య శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే 2014 నుంచి 2016 మధ్యకాలంలో ఆఫ్రికన్ దేశాలలో ఎబోలా వైరస్ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపింది. వైరస్ బారిన పడి వేలాది మంది ప్రాణాలు కల్పోయారు.

# జూన్ 3 నుంచి 19 వరకు బడిబాట

(మొదటి పేజీ తరువాయి)

బడి బాటలో భాగంగా ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు వీరు పాల్గొనాల్సి ఉంటుంది. జూన్ 12 నుంచి పాఠశాల లు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో 11 వరకు కీలకంగా మారనుంది. జూన్ 3న బడి బాటలో భాగంగా గ్రామాల్లో పలు ఆర్గనైజేషన్లతో సమావేశాలు నిర్వహిం చి అడ్మిషన్లు పెరిగేలా చూడాల్సిన బాధ్యత సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, ఏఏపీసీ మెంబర్లు, హెచ్‌ఎం, టీచర్లు, పేరెంట్స్ పై ఉండనుంది. వచ్చే నెల 4న గ్రామాల్లో డోర్ టు డోర్ ప్రచారం చేపట్టి అడ్మిషన్లు జరిగేలా చేపట్టాల్సి ఉంటుంది. వచ్చేనెల 5 నుంచి 10 వరకు డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేపట్టి అంగన్‌వాడీ తో పాటు ప్రభుత్వ స్కూళ్లలో అన్ని క్లాసుల వారీగా అడ్మిషన్లు పొందేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. జూన్ 11న గ్రామ సభ నిర్వ హించి పాఠశాల మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్చడం వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా వచ్చే నెల 12న పాఠశాల పున:ప్రారంభం కానుంది. 13న ఫౌండేషన్ లిటరసీ ప్రోగ్రామ్, లెర్నింగ్ ఇంప్రూవ్ మెంట్ ప్రోగ్రామ్, 14న సామూహిక అక్షరాభ్యాసం, 15న ఇంక్లూజివ్ ఎడ్యుకే షన్ డే అండ్ గర్ల్స్ ఎడ్యుకే షన్ డే, 18న డిజిటల్ క్లాసులు, ప్లాన్ టేషన్ పై అవేర్ నెస్ కల్పించను న్నారు. 19న స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

# జూన్ 1న కాశీ ప్రజలు కొత్త రికార్డును సృష్టించాలి

(మొదటి పేజీ తరువాయి)

కాగా, లోక్ సభ ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు ఆరు దశల్లో పోలింగ్ పూర్తి అయ్యింది. 7వ దశ పోలింగ్ జూన్ 1న జరగనున్నది. ఎనిమిది రాష్ట్రాలు, మరియు కేంద్ర పాలిత ప్రాంతాలలో మొత్తం 57 పార్లమెంట్ నియోజకవర్గాలకు పోలింగ్ జరగనున్నది. ఈ పోలింగ్ లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. హిమాచల్ ప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, జారండ్ మరియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో పోలింగ్ జరగనున్నది. ఉత్తర ప్రదేశ్, పంజాబ్ నుంచి 13 స్థానాలకు, పశ్చిమబెంగాల్ నుంచి 9 స్థానాలకు, బీహార్ నుంచి 8 స్థానాలకు, ఒడిశా నుంచి 6 స్థానాలకు, హిమాచల్ ప్రదేశ్ నుంచి 4 స్థానాలకు, జార?ండ్ నుంచి 3 స్థానాలకు, చండీగఢ్ నుంచి ఒక్కో స్థానానికి పోలింగ్ జరగనున్నది.

# ప్రచారం ముగిసింది..

(మొదటి పేజీ తరువాయి)

మోదీ సహా పలువురు ప్రముఖులు కూడా బరిలో ఉన్నారు. ప్రధాని మోదీ వారణాసి నుంచి పోటీ చేస్తున్నారు. కాగా, కొద్దిసేపటి క్రితం ప్రధాని మోదీ వారణాసి ఓటర్లకు వీడియో సందేశం పంపించిన విషయం తెలిసిందే. కాగా, బీహార్, హిమాచల్ ప్రదేశ్, యూపీ, పంజాబ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార?ండ్ మరియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో పోలింగ్ జరగనున్నది. యూపీ, పంజాబ్ నుంచి 13 లోక్ సభ నియోజకవర్గాలకు, పశ్చిమ బెంగాల్ నుంచి 9 లోక్ సభ నియోజకవర్గాలకు, బీహార్ నుంచి 8 లోక్ సభ నియోజకవర్గాలకు, ఒడిశా నుంచి 6 లోక్ సభ నియోజకవర్గాలకు, హిమాచల్ ప్రదేశ్ నుంచి 4 లోక్ సభ నియోజకవర్గాలకు, జార?ండ్ నుంచి 3 లోక్ సభ నియోజకవర్గాలకు, చండీగఢ్ నుంచి ఒక లోక్ సభ నియోజకవర్గానికి పోలింగ్ జరగనున్నది. లోక్ సభ ఎన్నికలను మొత్తం ఏడు దశల్లో నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆరు దశల్లో లోక్ సభ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఇటీవలే జరిగిన 6వ దశలో 57 నియోజకవర్గాల్లో 61.98 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఐదో దశలో 49 నియోజకవర్గాల్లో 62.2 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. నాలుగో దశలో 96 నియోజకవర్గాల్లో 69.16 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మూడో దశ పోలింగ్ లో 94 నియోజకవర్గాల్లో 65.68 శాతం పోలింగ్ నమోదైంది. రెండో దశలో 88 నియోజకవర్గాల్లో 66.71 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఇక మొదటి దశలో 102 నియోజకవర్గాల్లో 66.14 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మొత్తం ఏడు దశల్లో జరిగిన పోలింగ్ కు సంబంధించిన ఫలితాలు జూన్ 4న విడుదల కానున్నాయి. ఆరోజు తేలనున్నది ఏ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రానున్నది అనేది. అయితే, ఇప్పటికే ఇటు బీజేపీ, అటు ఇండియా కూటమి తమకంటే తమకు ఎక్కువ సీట్లు వస్తాయి.. తామే కేంద్రంలో అధికారంలోకి రాబోతున్నామంటూ పేర్కొన్న విషయం తెలిసిందే.

# ఎన్నికల ప్రచారంలో మోడీ ఉల్లంఘనలు

(మొదటి పేజీ తరువాయి)

232 సార్లు కాంగ్రెస్ పేరును ప్రస్తావించారు. 758 సార్లు సొంత పేరునే తలుచుకున్నారు. నిరుద్యోగ సమస్య గురించి మాత్రం ఒక్కసారి కూడా మాట్లాడలేదని ప్రధాని ప్రచార తీరును ఖర్గే ఎండగట్టారు. స్పష్టమైన ఆధిక్యంతో 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తంచేస్తూ.. దేశానికి సమ్మిళిత, జాతీయవాద ప్రభుత్వాన్ని అందిస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి మరోసారి అవకాశమిస్తే ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడం ఖాయమనే అభిప్రాయం ప్రజల్లోనూ వ్యక్తమవుతోందన్నారు. గాంధీపై సినిమా తీసేవరకు ఆయన గురించి ప్రపంచానికి పెద్దగా తెలియదంటూ మోదీ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని ఖర్గే కొట్టిపారేశారు. గాంధీ గురించి బహుశా ఆయన చదివి ఉండకపోవచ్చు. కానీ, మహాత్ముడు ప్రపంచవ్యాప్తంగా తెలుసు. ఐరాస సహా వివిధ ప్రదేశాల్లో బాపూజీ విగ్రహాలు ఉన్నాయి. ఒకవేళ మోదీకి గాంధీ గురించి తెలియకపోతే.. రాజ్యాంగం గురించి కూడా పెద్దగా తెలియనట్లే. జూన్ 4 తర్వాత ఎలాగో చాలా ఖాళీ సమయం దొరుకుతుంది. అప్పుడు గాంధీ ఆత్మకథ చదివి, ఆయన గురించి తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు.

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి చివరి రోజున కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ప్రధాని మోదీపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గాంధీజీపై ప్రధాని చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. మహాత్మాగాంధీ గురించి సినిమా చూసిన తర్వాత చాలామంది తెలుసుకున్నారని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే స్పందిస్తూ.. ప్రధానమంత్రి చదువుకుని ఉంటే ఇలాంటి మాటలు చెప్పువారుకాదన్నారు. ఆయన ప్రకటన ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. గాంధీ గురించి ప్రధానికి తెలియకపోతే రాజ్యాంగం గురించి కూడా తెలియదని అన్నారు. జూన్ 4 తర్వాత మోదీకి ఖాళీ సమయం దొరికితే గాంధీ ఆత్మకథ, సత్యంతో నా అనుభవాలు పుస్తకాలను తప్పక చదవాలన్నారు. ఇకపోతే ప్రధాని మోదీ రాజకీయాలు ద్వేషంతో నిండిపోయాయని ఖర్గే విమర్శించారు. ఈ ఎన్నికలు చిరకాలం గుర్తుండిపోతాయని ఖర్గే పేర్కొన్నారు. దేశంలోని ప్రతి పౌరుడు కుల, మతాలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి ఓట్లు వేశారన్నారు. మోదీ మాయమాటలను దేశ ప్రజలు నమ్మలేదన్నారు. జూన్4 తర్వాత కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం రాబోతుందని ఖర్గే తెలిపారు.

కన్యాకుమారిలో ప్రధాని మోదీ ధ్యానం చేయడానికి వెళ్లడంపై ఖర్గే ఘాటుగా స్పందించారు. వివేకానంద కేంద్రంలో ధ్యానం చేయడం వల్లనో, గంగలో స్నానం చేయడం వల్లనో విజ్ఞానం లభించదని,చదువుకోవడం ద్వారా జ్ఞానం లభిస్తుందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను మతంతో ముడిపెట్టి బీజేపీ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించిందని ఖర్గే పేర్కొన్నారు. ఎన్నికలకు ముందే కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింప చేశారన్నారు. మోదీ ప్రభుత్వం నియంతృత్వం వైపు వెళుతోందని, ఈ ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తుందని ఖర్గే విమర్శించారు.

# ఈశాన్యంలో నైరుతి ప్రవేశం

(మొదటి పేజీ తరువాయి)

అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ ఇప్పటికే అంచనా వేసింది. నాలుగైదు రోజుల్లో రుతు పవనాలు రాయలసీమలోకి ప్రవేశించే ఛాన్స్ ఉందని అధికారులు వెల్లడించారు. వారం ముందుగానే రుతుపవనాల పురోగమనంతో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గతేడాది కంటే ఈసారి ముందుగానే నైరుతి పవనాలు కేరళను తాకాయి. దేశ ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. మన దేశంలో 52 శాతం నికర సాగుభూమికి ఇప్పటికీ వర్షపాతమే ఆధారమే. ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40 శాతం వ్యవసాయ ఉత్పత్తులు దిగుబడి అవుతాయి. అటు, ఈ ఏడాది లానినా అనుకూల పరిస్థితులు, భూమధ్యరేఖ వద్ద పసిఫిక్ మహాసముద్రం చల్లబడడం, ఆగస్ట్ – సెప్టెంబర్ నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉన్న క్రమంలో ఈసారి సీజన్ లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ అధికారులు గత నెలలోనే అంచనా వేశారు. వాయువ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు



స్వాధీనం చేసుకున్న డ్రగ్స్

# రూ. 27 లక్షల విలువ చేసే 270 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

**రాజేంద్రనగర్, మే30(నమస్తే ఉదయం):** ఐ టీ, ప్రయివేటు కంపెనీ లలో పనిచేసే ఉద్యోగులు, ఈవెంట్ మేనేజర్ లకు డ్రగ్స్ విక్రయిస్తున్న మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఇద్దరిని బుధవారం శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు బండ్లగూడ సన్ సిటీ వద్ద వలపన్ని పట్టుకున్నారు. వారి నుంచి 270 గ్రాముల నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్ ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను గురువారం ఉప్పర్ పల్లి లోని శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లో ఇన్స్ పెక్టర్ గంద్ర దేవేందర్ రావు విలేకరులకు వివరించారు . సన్ సిటీ ప్రాంతంలో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయని అందిన ముందస్తు సమాచారం మేరకు బుధవారం సాయంత్రం ఎస్సై ఎం రాఘవేందర్ తో పాటు హెడ్ కానిస్టేబుల్ లతో రైడ్ పార్టీ ఏర్పాటు చేసి బండ్లగూడ జాగీర్ సన్ సిటీలో కాపు కాయడం జరిగిందన్నారు . ఒక మహిళ , పురుషుడు ప్యాసింజర్ ఆటోలో బ్యాగుతో దిగి అనుమానస్పదంగా కనిపించారన్నారు. వారిని ఆపి తనిఖీలు చేయగా బ్యాగులో తెల్లటి పౌడర్ రూపంలో ఉన్న పదార్థాన్ని గుర్తించామన్నారు. విచారణలో అది ఎండి ఎంఏ డ్రగ్ గా తేలిందన్నారు. పట్టుకున్న వారిలో మహారాష్ట్ర చంద్రపూర్ ఇండస్ట్రీ ఏరియా ప్రాంతానికి చెందిన తృప్తి ప్రభాకర్ హోకం ( 21), మధ్యప్రదేశ్ గ్వాలియర్ శివ పూరి కు చెందిన అనుభవ్ సక్సేనా( 24 ) గా గుర్తించామన్నారు. వీరు మాదాపూర్ అయ్యప్ప సొసైటీ సమీపంలోని అలీపూర్ వద్ద నివాసం ఉంటున్నారన్నారు. ఇద్దరు కూడా అర్బన్ క్లాప్ కంపెనీలో మేనేజర్ లుగా పనిచేస్తున్నారని తెలిపారు. మహారాష్ట్ర కు చెందిన సాబర్ అనే వ్యక్తి దగ్గర తక్కువ ధరకు డ్రగ్స్ కొని నగరంలో ఎక్కువ మొత్తంలో విక్రయిస్తున్నామని ఒప్పుకున్నారన్నారు.



వెలగని వీధి దీపాలు

# బస్తీలో వెలగని వీధీ దీపాలు

## పట్టించుకొని మున్సిపల్ అధికారులు

**రాజేంద్రనగర్, మే30(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ లో వీధి దీపాలు వెలగడం లేదని సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు వనంపల్లి జైపాల్ రెడ్డి ఆరోపించారు. మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలలో వీధిలైట్లు గత 15 ను రోజుల నుండి వెలగడం లేదన్నారు. కాటేదాన్ , దుర్గా నగర్, టీఎన్జీవోస్ కాలనీ, మధుబన్ కాలనీ, తదితర బస్తీలలో రాత్రి వేళల్లో వీధీ దీపాలు వెలగడం లేదని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు.

మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలు పటించుకోవడం లేదని, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వీధీ దీపాలు వెలిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.



కాటేదాన్ డంపింగ్ యార్డు బయట సీఐటీయూ జెండా ఎగురవేస్తున్న భూపాల్, ఎస్. రామ్మోహన్ తదితరులు

# సీఐటీయు 54వ ఆవిర్భావ దినోత్సవం

**రాజేంద్రనగర్, మే30(నమస్తే ఉదయం):** సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ మండలం కాటేదాన్ డంపింగ్ యార్డ్‌లో గురువారం సిఐటియు జెండాను ఆవిష్కరించారు. సీఐ టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ జెండాను ఆవిష్కరించారు. డంపింగ్ యార్డ్ నుండి బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

ర్యాలీ డంపింగ్ యార్డ్ నుండి కాటేదాన్ క్లస్టర్ మీదుగా సిఐటియు కాటేదాన్ ఆఫీస్ వరకు కొనసాగింది. అనంతరం సిఐటియు విశిష్టత – కార్మికుల పాత్ర అనే అంశంపై సదస్సును కాటేదాన్ ఆఫీసులో భూపాల్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్, సహయ కార్యదర్శి ఎస్ రామ్మోహన్ రావు, రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.కురుమయ్య, సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం సదస్సులో మాట్లాడడం జరిగింది. సిఐటియు కార్మిక సంఘం ఆవిర్భవించి నేటికీ 54వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా జెండా ఎగుర వేయడం సంతోషంగా ఉందన్నారు.

ఈ సందర్భంగా వివిధ విభాగాలలో, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కార్మిక చట్టాలు పూర్తిస్థాయిలో అమలు చేసే విదంగా ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు చట్టాలు, కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వా కార్యాలయాలలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కార్మిక చట్టాలు తెలియక అనేక విధాలుగా, కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. తీవ్రమైన పని ఒత్తిడి, కక్ష్య సాధింపు చర్యలు, వేధింపులు, పని భద్రత లేకుండా చేయడం లాంటివి అనేకం జరుగుతున్నాయన్నారు. వీటిపై ఫిర్యాదు చేసిన, చర్యలు తీసుకునే అధికారులే లేరని వాపోయారు. ఈ నిర్లక్ష్యం మూలంగా కార్మికులకు చట్టాలు అమలు కావడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితులలో కార్మికులకు భరోసా ఇచ్చే విధంగా లేబర్ కమిషనర్ పరిశ్రమలలో పర్యటించి క్షేత్రస్థాయిలో కార్మిక చట్టాలు అమలు ఏ విధంగా జరుగుతుందో, కనీస సౌకర్యాలు కూడా లేకుండా కార్మికులు ఎంత ఇబ్బందులకు గురవుతున్నారో చూడాలన్నారు. అంతేకాకుండా చేసిన పనికి కూడా సకాలంలో వేతనాలు రాక, చేసే పనికి భద్రత లేకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొనే విషయాలను ప్రత్యక్షంగా పర్యటించి తెలుసుకోవడం ద్వారా కార్మికులకు ఏమైనా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గండిపేట్ మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్, కాటేదాన్ క్లస్టర్ కోశాధికారి భాస్కర్, డంపింగ్ యార్డ్ కమిటీ నాయకులు మోహన్, బాలకృష్ణ, డంపింగ్ యార్డ్ కార్మికులు , కాటేదాన్ క్లస్టర్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ఇతర ప్రజాసంఘాల కార్మికులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ



ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్మెంట్

## నేడు ఐసీఎంలో ప్రోగ్రాం

# అడ్వైజరీ కమిటీ సమావేశం

**రాజేంద్రనగర్, మే30(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ లోని సహకార నిర్వాహణ సంస్థ (ఐసీఎం)లో ఈ నెల 31న ప్రోగ్రామ్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఐ సి ఎం ఫ్యాకల్టీ డాక్టర్ ఎస్ ఎల్ ఎన్ టి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం లో భారత ప్రభుత్వం ఆదేశాలకనుగుణంగా తెలంగాణ రాష్ట్రము లో ఉన్న సహకార సంస్థ లలో మానవ వనరుల అభివృద్ధి కీ అవసరమైన అవగాహన, శిక్షణ కార్యక్రమాలను గుర్తించి వాటిని అమలు చేయటానికి సంస్థల వారీగా ప్రణళికలు రూపొందించటానికి ప్రోగ్రామ్ అడ్వైసరీ కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ సమావేశం తెలంగాణ రాష్ట్ర సహకార సంఘముల రిజిస్ట్రార్ హరిత అధ్యక్షత వహిస్తారని, సంస్థ డైరెక్టర్ కన్వీనర్ గా వ్యవహారిస్తారని తెలిపారు. సమావేశానికి రాష్ట్రము లోని వివిధ సహకార శాఖల ఆధిపతులు, సిబ్బంది పాల్గొననున్నారని డాక్టర్ యస్. ఎల్.ఎన్. టి. శ్రీనివాస్ పేర్కొన్నారు.

# ఆర్ ఫ్యాక్టర్ కాంగ్రెస్ విజయానికి కీలకం: కాంగ్రెస్ నేత పసియుద్దీన్



**శంషాబాద్, మే 30, (నమస్తే ఉదయం):** ఇటీవలి తెలంగాణా అసెంబ్లీ ఎన్నికలలో, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డికి మైలురాయి గా నిలిచే విజయాన్ని అందించడానికి, ఆర్ అంశం రాబోయే ఎన్నికల ఫలితాలలో కీలకంగా మారనున్నదని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పసియుద్దీన్ అహ్మద్ పేర్కొన్నారు.. దేశంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో, కాంగ్రెస్ పార్టీ భారతదేశం అంతటా శాంతి. సామరస్యాన్ని పెంపొందించే మత విద్వేషాలు లేని దేశానికి మార్గం సుగమం చేస్తుందని అన్నారు. ప్రపంచం మొత్తానికి ఐక్యత పురోగతికి చిహ్నంగా నిలిచే అభివృద్ధి చెందిన భారతదేశాన్ని మేము ఊహించుకుంటూనామని పసియుద్దీన్ అహ్మద్ అన్నారు.చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో రంజిత్ రెడ్డి విజయానికి కూడా ఇది దోహదం చేస్తుందని అన్నారు.

## ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే

# కఠిన చర్యలు తీసుకుంటాం



**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 30(నమస్తే ఉదయం):** ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

గురువారం ఐ డి ఓ సి లోని కాన్ఫరెన్స్ హాల్లో వ్యవసాయ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి దుకాణంలో డీలర్లు తప్పనిసరిగా స్టాక్ బోర్డు,అమ్మకాల వివరాలు విధిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాక్ బోర్డ్ లో సూచించిన వివరాలకు అనుగుణంగా వారి దుకాణంలో స్టాకు ఉందో, లేదో తనిఖీ చేయాలన్నరు. విత్తన డీలర్లు ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరకు అమ్మరాదని, నకిలీ విత్తనాలు అమ్మే వారిపై నిఘా ఉంచాలని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని సూచించారు. నిబంధనలను పాటించని డీలర్లపై తక్షణ చర్యలు తీసుకున్నప్పుడే మిగతా డీలర్లు సక్రమంగా రైతులకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తారన్నారు. జూన్ 15 వరకు ప్రతి మండలంలో వ్యవసాయ అధికారులు రోజుకు నాలుగైదు దుకాణాలు తనిఖీ చేస్తూ రైతులకు సక్రమంగా విత్తనాలు అందేలా చూడాలన్నారు. ఏమైన విత్తనాలు, ఎరువుల కొరత ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే అవసరం మేరకు స్టాకు తెప్పించి, రైతులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో సరఫరా అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద నాయక్, మండలాల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### హైదర్‌గూడ పోచమ్మ దేవాలయంలో

# మురుగు పరుగు..

### అమ్మవారి విగ్రహం కింద నుంచి పారుతున్న డ్రైనేజీ నీరు

### దేవాలయాన్ని పునర్నిర్మిస్తేనే సమస్య తీరుతుంది-స్థానికులు

**రాజేంద్రనగర్, మే 30(నమస్తే ఉదయం):** అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ దళిత బస్తీలో చారిత్రాత్మకమైన పోచమ్మ దేవాలయం ఉంది. హైదర్‌గూడ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్ వెనుక ఉన్న ఈ దేవాలయానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. కోరిన కోరికలు తీర్చే అమ్మవారికి ప్రసిద్ధి పొంది ఇక్కడి ప్రజలకు అండగా నిలుస్తుంది. ఈ దేవాలయాన్ని నిర్మించి ఏళ్లు గడుస్తుండడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పక్కనే ఉన్న డ్రైనేజీ నీరు దేవాలయంలోకి చొచ్చుకు వస్తున్నాయి. గతంలో సైతం ఈ సమస్య ఉన్నప్పటికి తాత్కలిక మరమ్మత్తులు చేసి ఈ సమస్యను తీర్చారు. కానీ మళ్లి మురుగు ప్రవాహం రోజు రోజుకు అధికమవుతూ దేవాలయంలోకి వస్తుంది. దీంతో దేవాలయంలో అమ్మవారికి పూజలు చేసేందుకు సైతం వీలు లేకుండాపోతుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. రోజు రోజుకు పరిస్థితి మరి దారుణంగా మారుతున్నాయని స్థానికులు వెల్లడిస్తున్నారు. దేవాలయ అభివృద్ధి కోసం చర్యలు తీసుకునేందుకు ఏ ఒక్కరు ముందుకు రాకపోవడంతో చారిత్రాత్మకమైన దేవాలయం ఇలా ఎవరికి ఆలనపాలన లేకుండా ఉండిపోయే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సమస్యలు వచ్చిన సమయంలో దేవలయాన్ని పునర్నిర్మిస్తామని



ప్రకటించుకున్న ఆ తీర్మాణాలు నీరుగారిపోయాయి. ఇప్పటికైనా దేవాలయాన్ని పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోని భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# నేడు విద్యుత్తు లేని ప్రాంతాలు

**రాజేంద్రనగర్, మే 30(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని గాంధీ నగర్ లో శుక్రవారం 10:30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, జలాల్ బాబా నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం నాలుగున్నర వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్చార్జ్ అసిస్టెంట్ ఇంజనీర్ హరినాథ్ చారి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

#### ఇబ్రహీం బాగ్‌లో..


ఇబ్రహీం సెక్షన్ పరిధిలోని జనచైతన్య విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10:30 నుండి 11:30 వరకు జన చైతన్య కాలనీ, పంచవటి కాలనీ రోడ్ నెంబర్ 17 నుండి 31 వరకు, పంచవటి ఫీడర్ 11:30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పంచవటి కాలనీ రోడ్ నెంబర్ 1 నుండి 17 వరకు హనుమాన్ నగర్ విద్యుత్ ఫైటర్ పరిధిలోని ప్రాంతాలలో హనుమాన్ నగర్ శివపురి కాలనీ మర్రిచెట్టు నుండి పంచవటి ప్రధాన రహదారి వరకు మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్ తెలిపారు.

#### నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలో...

నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలోని వట్టినాగులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడానికి శుక్రవారం మధ్యాహ్నం 11:30 నుండి 1:00 వరకు శ్రీదేవి ఇంజనీరింగ్ కళాశాల విద్యుత్ పీటర్ పరిధిలో గల ప్రాంతాలైన వట్టినాగులపల్లి నుండి శ్రీదేవి కళాశాల వరకు, వివేకానంద నగర్, ఇంద్రారెడ్డి నగర్, శ్రీదేవి కాలేజ్, ఎస్ ఓ ఎస్ స్కూల్, వట్టినాగులపల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలలో గల వట్టినాగులపల్లి మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం నాలుగున్నర వరకు ఓఆర్ఆర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి మూడు గంటల వరకు వట్టినాగులపల్లి సర్వీస్ రోడ్ ,మంగళగడ్డ ,విస్టా స్కూల్, గ్రామపంచాయతీ పరిధిలో సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్ రెడ్డి తెలిపారు.

#### శంషాబాద్‌లో...

శంషాబాద్ పాత విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించడానికి శుక్రవారం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అమ్మపల్లి, సుల్తాన్ పల్లి, కవ్వగూడ,సదరన్, చౌదర్ గూడ ,దొడ్డి మజీద్ గడ్డ, రెండు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు రాళ్లగూడ, బీసీ హాస్టల్, సీఎస్ కె, కామ ఎంక్లేవ్ సిద్దులగుట్ట



కోత్వాలు గూడ, కవ్వగూడ రాయల్ విల్లా ఊట్పల్లి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

# దొరల ప్రభుత్వంలో ఘనకార్యాలు గుర్తుతెచ్చుకోండి

**జయశంకర్ సార్, కోదండరాం సార్, అందెశ్రీ లను అవమానించింది మీరు కాదా?**

**ఫక్తు రాజకీయ పార్టీ పేరుతో ఆంధ్రులకు సభ్యులు కట్టింది మీరు కాదా?**

**అయ్యా కేసీఆర్, కేటీఆర్ మీకు ఉద్యమకారులు గుర్తుకు వచ్చారా?**

**యాదగిరిగుట్టను యాదాద్రిగా మార్చింది కేసీఆర్ కాదా?**

**ఉద్యమ ద్రోహులను అందల మెక్కించారు**

**ఉద్యమకారులను అవమానించింది మీరు కాదా?..**

**- శేరి సతీష్ రెడ్డి**

**కూకట్‌పల్లి, మే 30 (నమస్తేఉదయం):** తెలంగాణ ఉద్యమ సెంటిమెంట్ ను రెచ్చగొట్టి, అమాయక తెలంగాణ విద్యార్థులు ఆత్మహత్యలకు కారకులు కేసీఆర్ కుటుంబం కాదా అని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షకు కారకులైన ప్రొఫెసర్ జయశంకర్ సార్ లతోపాటు తెలంగాణ రాష్ట్ర గీతంగా జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం అంటూ అద్భుత గీతాన్ని రచించిన అందెశ్రీ, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ



చైర్మన్ గా ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం సార్లను అవమానించిన ఘనత కేసిఆర్ కుటుంబం ఉందని అన్నారు. ప్రస్తుతం అందెశ్రీ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించిన రేవంత్ రెడ్డిని సంగీత దర్శకుడు కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారని విమర్శలకు తెరలేపిన బీఆర్ఎస్ నేతలు గురువింద చందంగా తయారయ్యారని అన్నారు. జాగృతి సంస్థను స్థాపించిన కల్వకుంట్ల కవిత ప్రపంచవ్యాప్తంగా బతుకమ్మ పేరుతో కవితమ్మ బతుకమ్మ పాటలు ఏ ఆర్ రెహమాన్ పాడిస్తే అది ఆంధ్రుడు కాదా అని ప్రశ్నించారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన చిన్న జీయర్ స్వామి ట్రస్టుకు ఎకరానికి 12 కోట్ల వ విలువగల భూమిని 16 లక్షలకు కట్టబెట్టినారు ఆంధ్ర ఆయన కాదా? కాళేశ్వరం ప్రాజెక్టును లక్షల కోట్ల విలువ గల కాంట్రాక్టును మేఘ కృష్ణా రెడ్డి కి ఇచ్చినారు వారు ఆంధ్ర ఆయన కాదా అని ప్రశ్నించారు.

యాదగిరిగుట్ట డిజైను ఆనంద్ సాయికి ఇచ్చినారు వారు ఆంధ్ర ఆయన కాదా? సినీనటి సమంత కి మన బ్రాండ్ అంబాసిడర్ చేసినారు కోట్ల రూపాయలు ఇచ్చినారు వారు ఆంధ్రమే కాదా అని ప్రశ్నించారు.

శారదా పీఠానికి రెండు కోట్ల విలువ గల చేసే భూమిని ఒక రూపాయి కట్టబెట్టింది మీరు వారు ఆంధ్ర కాదా తెలంగాణకు చెందిన గాయకుడు అందెశ్రీ పాడిన గేయానికి సంగీతం ఆస్కార్ అవార్డు కీరవాణి అందిస్తే తప్పేంది గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించకపోవడం మీకు సిగ్గుచేటు దాన్ని రాష్ట్ర గీతంగా ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ గుర్తించి తీసుకోవడం ద్వారా ఆమోదించవలసిన విషయం దానికి గగ్గోలు పెట్టడం మీకు సిగ్గుగా లేదా, రాజముద్రలో అమరవీరు స్తూపం ఉంటే తప్పేంది అమరవీరుల త్యాగాల ఫలితం రాష్ట్రం వచ్చిందన్నారు. అధికారం కోల్పోయిన విషాదంలో కేసీఆర్ కుటుంబం టిఆర్ఎస్ నాయకులు మతితప్పి మాట్లాడుతున్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పైన విమర్శలు మానుకోకపోతే ప్రజలు రాబోయే రోజుల్లో వీరికి సరైన బుద్ధి చెబుతారని శేరీ సతీష్ రెడ్డి హెచ్చరించారు.




# రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిరాడంబరంగా నిర్వహించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 30(నమస్తే ఉదయం):** జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిరాడంబరంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. గురువారం ఐడిఓసి లోని సమావేశపు మందిరంలో ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిరాడంబరంగా నిర్వహించుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాల్లో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు లేకుండా తమ తమ కార్యాలయాల వద్ద నిర్వహించుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని కార్యాలయాలలో ఉదయం 8:30 గంటల వరకు పతాకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించుకుని, జిల్లా అధికారులు అందరూ ఉదయం 9:00 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులను స్మరించుకోవడం, గౌరవించుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, ముసిని వెంకటేశ్వర్లు, ఆర్డీవో రామచందర్ లతో పాటి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### రైతులకు నాణ్యమైన విత్తనాలు

# ఉత్పత్తి చేయాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 30(నమస్తే ఉదయం):** రైతులకు నష్టం జరగకుండా మంచి నాణ్యతమైన విత్తనాలు ఉత్పత్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ విత్తన ఉత్పత్తిదారులకు ఆదేశించారు. గురువారం ఐ.డి.ఓ.సి కాన్ఫరెన్స్ హాల్ నందు విత్తన ఉత్పత్తి దారులతో సమీక్ష సమావేశం



నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లడుతూ, రైతులకు ఏలాంటి సమస్యలు తలెత్తకుండా విత్తన ఉత్పత్తిదారులు రైతులకు మేలు జరిగేలా మంచి విత్తనాలు అందజేయలన్నారు.

జిల్లాలో పంటలకు అవసరమైన అనుకూల వాతావరణం ఉన్నందున రైతులకు అహగాహన కల్పించి మంచి రకం విత్తనాలు అందజేయలన్నారు. నాసిరకం విత్తనాలు ఇవ్వరాదన్నారు. పంపిణీ అనంతరం రైతులకు అహగాహన కల్పించాలన్నారు. ఎస్.ఓ.పి ఉల్లంగిస్తే చట్టపరంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో డిమాండ్ కు అనుగుణంగా మంచి విత్తనాలు పంపిణి చేయాలన్నారు. రైతులు నష్టపోకుండా కంపెనీలు మంచి విత్తనాలు అందజేయాలని, జిల్లా యంత్రాంగం కంపెనీలకు పూర్తి సహకారం అందించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద నాయక్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకటలక్ష్మి, విత్తన ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఏకరూప దుస్తులను

# అందజేసేలా చర్యలు తీసుకోవాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 30(నమస్తే ఉదయం):** పాఠశాలలు పున ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను అదేశించారు. గురువారం గద్వాల మండలం అనంతపురం గ్రామంలో మహిళా సంఘ సభ్యులు కుడుతున్న విద్యార్థుల ఏక రూప దుస్తుల కుట్టు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి ఎస్ సంతోష్ మాట్లాడుతూ... ఏక రూప దుస్తుల తయారీ ప్రక్రియ నిబంధనల ప్రకారం ఉండాలన్నారు. విద్యార్థుల సంఖ్య, ఇప్పటి వరకు తయారైన, తయారు కావాల్సిన వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. యూనిఫామ్ ల తయారీ విధానాన్ని, బట్ట నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల నుంచి తీసుకున్న కొలతల ప్రకారమే దుస్తులను కుట్టాలన్నారు.



గతంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో పలు ఏజెన్సీ నిర్వాహకులు యూనిఫామ్స్ కుట్టేవారని , ప్రస్తుతం మహిళా సంఘాల సభ్యులకు కుట్టే బాధ్యతలు అప్పగించడంతో వాళ్లు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఏర్పడిందన్నారు . భవిష్యత్తులో అంగన్వాడి కేంద్రాల్లోని చిన్నారులకు కూడా ఏకరూప దుస్తులు కుట్టేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉందన్నారు. అన్ని వయసుల పిల్లలకు దుస్తులు కుట్టేందుకు వీలుగా భవిష్యత్తులో అవసరమైన మహిళా సంఘ సభ్యులకు కుట్టు పనికి సంబంధించిన శిక్షణ ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 52 స్టిచ్చింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి 725 మంది స్వయం సహాయక సంఘాల టైలర్ లు వస్త్రాలను నిర్విరామంగా కుడుతున్నారని, 27,823 మంది బాలికలు 26,073 మంది బాలురు మొత్తం 53,896 మంది గ్రామీణ విద్యార్థులకు వస్త్రాలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇట్టి దుస్తులను జూన్ 5వ తేదీ నాటికి సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే 40శాంతం ఏకరూప దుస్తులు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ నర్సింగరావు, ఏపీడీ నరసింహులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# ఐలా స్థలంలో గోడను తొలగించి ప్రమాదాలను నివారించండి

**- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్‌పల్లి, మే 30 (నమస్తే ఉదయం):** కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతే నగర్ డివిజన్ శివాలయం బస్తీకి సమీపంలో పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఐలా స్థలంలో గోడ నిర్మించడం వల్ల ప్రజలకు రాకపోకలకు అంతరాయం కలుగుతుందా నేపథ్యంలో ప్రమాదాలకు కారణమవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఆయా ప్రాంతాన్ని పరిశీలించారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో అనేకమంది వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ఇదే ప్రాంతంలో బస్తీవాసులు అనేక మంది ఉన్నందున ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ కు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్ గౌడ్ ల దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ఎమ్మెల్యే కృష్ణారావు స్పందించి డిసి ఐల కమిషనర్, ఐలా జోనల్ కమిషనర్ తో చర్చించి స్థలం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కురుమయ్య, ఎర్ర నరసయ్య, డేవిడ్, సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.